# అప్పగింతలు

## మల్లాది రమాంజలి

కథ

"సావిత్రీ! పెళ్లివారు వచ్చేశారట.. మనం విడిదికి వెళ్లి అక్కడ ఏర్పాట్లు సరిగా ఉన్నాయో లేదో చూసి వద్దాం. వాళ్లకి రాగానే కొబ్బరి బోండాలివ్వమని మన సుధాకర్‌కి, కళ్యాణికి చెప్పి పంపించాను. వాళ్లు ఆ ఏర్పాట్లలో ఉన్నారు. పెళ్లికొడుక్కి ప్రత్యేకమైన గది, ఆడపడుచులకు ఓ గది, అత్తమామలకి ఓ గది, మిగతా బంధువులందరికీ ఓ పెద్ద హాల్. దానిలో ప్రత్యేకమైన టాయిలెట్స్.. వారికి సౌకర్యాలన్నీ సరిగా ఉన్నాయని నేననుకుంటున్నాను. ఎదురుకోలకి దండలు, వరపూజకి వెండి సామగ్రి రెడీ చేసి ఉంచు. నీవు త్వరగా తెములు" దివాకర్ భార్యను తొందర చేశాడు.

"ఇదిగో వచ్చేస్తున్నానండీ... సుమైత్రికి పూలజడ తేవటానికి కిరణ్‌ని పంపించాను. వాడు ఇంతవరకూ రాలేదు. ఎక్కడ ఉన్నాడో, ఏం చేస్తున్నాడో" కొత్త పట్టుచీర సవరించుకుంటూ బయటకు వచ్చింది సావిత్రి.

ఓ నిమిషం భార్యను తేరిపార చూశాడు దివాకర్.

కూతురికి కన్యధారపోసేటపుడు జుట్టు ముడి చుట్టాలని ఎవరు చెప్పారో గానీ సావిత్రి పెద్దరికంగా, వింతగా కనపడింది దివాకర్‌కి. నలభై సంవత్సరాల సావిత్రి ఆరిందాలా కనపడుతుంటే ఒక్క క్షణం నవ్వు వచ్చిందతనికి.


"ఏమిటండీ... ఆ వింత చూపులూ మీరూనూ. పదండి ఆలస్యమవుతోంది" భర్తను తొందర చేసింది సావిత్రి.

కొంతమంది బంధువులను వెంటపెట్టుకుని కారులో పెళ్లివారి దగ్గరకు బయలుదేరారు వాళ్లిద్దరూ.

దివాకర్ ఓ బ్యాంక్‌లో మేనేజర్‌గా ఉన్నాడు. కూతురు సుమైత్రికి ఇంజనీరింగ్ కాగానే వెంటనే పెళ్లి కుదరటంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారా దంపతులు. దివాకర్‌కి సుమైత్రి కాకుండా మెడిసిన్ చదివే కొడుకు కిరణ్ ఉన్నాడు. పెద్దగా కట్నకానుకలు ఏమీ తీసుకోకపోవటంతో సుమైత్రి అత్తవారు మంచివారేనని అభిప్రాయపడ్డారు ఆ దంపతులు. పెళ్లికొడుకు సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, ఆరడుగుల అందగాడు, సుమైత్రికి అందంలో ఏం తీసిపోడు.

మరో పది నిమిషాలలో పెళ్లివారి దగ్గరకు చేరుకున్నారు సావిత్రి, దివాకర్. మొత్తం వంద మంది దాకా ఉన్నారు పెళ్లివారు.

ఇద్దరు ముగ్గురు పనివాళ్లతో వాళ్ల లగేజ్‌నంతా గదుల్లో సర్దించాడు దివాకర్.



అడుగడుగునా మర్యాదలకు తక్కువ కాకుండా చేస్తూ ఉండటంతో పెళ్లివారు తృప్తి పడుతున్నారు. పెళ్లికూతురు సిగ్గు దొంతరలు, పెళ్లికొడుకు ఓరచూపులతో, బంధుజనం సందడితో ఎదురుకోలు అందంగా, కనువిందుగా, సరదాగా జరిగింది. తెల్లవారుఝామున ముహూర్తం కావటంతో సాయంత్రం నాలుగు గంటలకే విడిది చేరుకున్నారు పెళ్లివారు.

ఫలహారాల పళ్లాలు దేనికీ తక్కువ కాకుండా రకరకాలూ ఇచ్చారు ఆడపెళ్లివారు. పెళ్లిమంటపం రంగురంగుల పూలతో అలంకరిస్తున్నారు పనివాళ్లు. ఐదున్నర గంటలకల్లా మంటపం తయారుచేయాలనీ, రిసెప్షన్‌కి టైమవుతోందని వాళ్లని తొందర చేశాడు దివాకర్.

మంటపంలో సింహాసనం లాంటి కుర్చీలు ఏర్పాటు చేశారు. మగపెళ్లివారికి ఒకవైపు, ఆడపెళ్లివారికి ఒకవైపు కుర్చీలు సర్దించాడు సుధాకర్. అన్నయ్య దివాకర్‌కి అన్ని పనులలోనూ కుడిభుజంలా సహాయం చేస్తున్నాడు అతను.

రిసెప్షన్ మొదలైంది.

వయసులో ఉన్న పిల్లలందరూ అంత్యాక్షరి మొదలుపెట్టారు. దివాకర్ ఆఫీసు వాళ్లు, ఫ్రెండ్స్, సుమైత్రి ఫ్రెండ్స్‌తో హాల్



నిండిపోయింది. వధూవరుల చేత దండలు మార్పించారు. వీడియో అతను, ఫోటోగ్రాఫర్ వాళ్ల పనిలో ఉన్నారు.

కిరణ్ హడావిడిగా మంటపంలో ప్రవేశించాడు. అతని కళ్లు తల్లి కోసం వెతికాయి. సుమైత్రి చెవిలో ఏదో చెపుతూ నవ్వుతూ, సంతోషంగా ఉన్న తల్లికి తను చెప్పాలనుకున్న విషయం చెప్పటానికి మనసు రాలేదతనికి. కానీ చెప్పకతప్పదు... మెల్లగా వెళ్లి తల్లి భుజం మీద చేయి వేశాడతను. వెనక్కి తిరిగి చూసిన ఆమె కోపంగా కిరణ్‌ని ఏదో అనబోయింది.

తల్లి కోపానికి కారణం తెలిసిన కిరణ్ ఆమె చేయి పట్టుకొని గబగబా దగ్గరలో ఉన్న రూమ్‌కి తీసుకువెళ్లాడు.

"ఏమిట్రా ఈ హడావిడి... పెళ్లికూతురి పూలజడ ఏదీ? ఒక్కొక్క పనీ ఇంతసేపు చేస్తే ముహూర్తం టైమ్ వరకూ ఏ పనీ కాదు" మందలించింది సావిత్రి.

"అమ్మా! పూలజడ సంగతి తర్వాత... ముందు నాయనమ్మ సంగతి చూడు. అత్తల సంగతి చూడు. వాళ్లకు నీవు తెచ్చిన చీరలు నచ్చలేదట. మంటపంలో ఏం గొడవ చేస్తారో ఏమిటో. నాయనమ్మ కోపంగా ఉంది. అత్తలంతా ఏడుస్తున్నారు" కంగారుగా చెప్పవలసింది చెప్పాడు కిరణ్. సంగతి విని అవాక్కయింది సావిత్రి. అత్తగారు, ఆడపడుచుల సంగతి ఆమెకు తెలిసిందే. కాపురానికి వెళ్లినది లగాయతూ తనని ఎంత రాచిరంపాన పెట్టారో ఆమె ఏడేడు జన్మలెత్తినా మరచిపోలేదు. ఇప్పుడు ఈ పెళ్లిలో తమ విశ్వరూపాలు చూపితే పెళ్లివారేమనుకుంటారు? బెంబేలెత్తిపోయింది సావిత్రి.

కూతురి అదృష్టం బాగుండి ఈ సంబంధం కుదిరితే మందిలో రసాభాస చేసి తన కూతురి జీవితాన్ని ఎక్కడ చెడగొడతారోనని హడలిపోయింది. గబగబా నడుచుకుంటూ అత్తా ఆడపడుచులున్న రూమ్ వైపు వెళ్లింది. అప్పటికే పట్టు చీరలన్నీ ఓ మూల పడేసి కళ్లొత్తుకుంటున్నారు ఆడపడుచులూ, అత్తగారూ. సావిత్రిని చూడగానే సివంగిలా లేచింది అత్తగారు.

"ఇవేం చీరలు అమ్మాయ్ ముష్టి చీరలు. ముందుగా మాకు పెట్టి రిసెప్షన్‌కి కట్టుకోమంటే ఎంత ఖరీదైనవో అనుకున్నాం. ఈ రోజుల్లో పనిమనుషులు కూడా కట్టటం లేదు ఈ చీరలు"

మూడువేల ఖరీదున్న ఆ చీరలను ఒక్కొక్క దాన్నీ చిత్తుకాగితాల్లా కుప్పలా పోసింది అత్తగారు.

"ఏం వదినా! పెళ్లికని పిలిచి ఇవేనా మర్యాదలు? మాది అడుక్కు తినే వంశం అనుకున్నావా! ఏదో నాలుగు డబ్బులు మా ముఖాన కొడితే మేమే కొనుక్కునే వాళ్లం కదా! ఇవేం రంగులు, ఇవేం అంచులు?" పెద్ద ఆడపడుచు కంఠం ఖంగుమంది.

"ఏదో వదినా! పెళ్లికి ఎక్కువ సమయం లేకపోవటంతో త్వరగా కొనేశాము. ఏమీ అనుకోకండి. ఈసారి మీకు కావల్సిన చీరలు తెప్పిస్తాను" నచ్చచెప్పటానికి ప్రయత్నించింది సావిత్రి.

"ఆ....ఆ... ఇప్పుడు గతి లేదు కానీ ఎప్పుడో ఇస్తుందట ఈవిడగారు" రెండో ఆడపడుచు వ్యంగ్యంగా అంది.

మంటపంలో సావిత్రి కనపడకపోవటంతో వెతుక్కుంటూ అక్కడికి వచ్చాడు దివాకర్. అక్కడి పరిస్థితిని త్వరగానే ఆకళింపు చేసుకున్నాడతను. తల్లి, చెల్లెళ్ల మనస్తత్వాలు తెలిసిన వాడు కాబట్టి వెంటనే కేష్ బేగ్ నుంచి ఇరవై వేలు తీసి తల్లి చేతిలో పెట్టాడు.

"అమ్మా! దయచేసి గొడవ చేయకండి. శుభమా అని పెళ్లి జరుగుతుంటే సంతోషించవలసింది పోయి ఈ గొడవలేమిటి?" చిన్నగా

## నో నంబర్స్ ప్లీజ్

అందాల అనుష్కని మీరు నంబర్ వన్ హీరోయిన్ అయిపోయారని భావిస్తున్నారా? అని అడిగితే- 'అసలీ నంబర్‌ల మీద నాకు బొత్తిగా నమ్మకం లేదు. నంబర్ వన్నంటూ గాల్లో తేలిపోవడం నాకు నచ్చదు. వాస్తవంలో జీవించాలనుకుంటాను. అయినా చిత్రసీమ భలే విచిత్రమైనది. ఏ నిమిషానికి ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. అందుకని నంబర్ వన్, టూ, త్రీ అనే రాంకింగుల గురించి అస్సలు పట్టించుకోను' అని తేల్చి చెప్పేసింది అనుష్క.

మందలించాడు. డబ్బులు చేతిలో పడటంతో మారుమాట్లాడకుండా ఎవరి చీర వాళ్లు తీసుకొని తయారైపోయారంతా. సావిత్రి తేలిగ్గా నిట్టూర్చింది. కానీ పుర్రెతో వచ్చిన బుద్ధి పుడకలతోనే పోతుందన్నట్లు... భోజనాలు అవుతున్నంతసేపూ ఏదో విమర్శ చేస్తూనే ఉన్నారు సావిత్రి అత్తగారు, ఆడపడుచులు.

ఈ పెళ్లి సవ్యంగా జరిగేటట్లు చూడు దేవుడా! అని కనిపించిన దేవుళ్లందరికీ మొక్కుతోంది సావిత్రి.

బంధువులందరి భోజనాలూ అయి, తన భోజనం అయ్యేసరికి రాత్రి పదకొండు గంటలు దాటింది. కూతురి పక్కనే చోటు చేసుకొని నడుం వాల్చింది. అప్పటికే సుమైత్రి గాఢనిద్రలో ఉంది. కల్లాకపటం తెలీని ఈ పిచ్చితల్లి రేపు అత్తవారింటికి వెళ్లబోతోంది. ఇరవై సంవత్సరాలు తన చేతుల్లో ముద్దుగా, అపురూపంగా పెరిగిన ఈ బంగారు బొమ్మ పరాయిదైపోతోంది. సావిత్రి కళ్లల్లో రెండు కన్నీటి చుక్కలు... నిద్రపోతున్న కూతురి చెంపలు అప్యాయంగా నిమిరింది. నిద్రలో అందంగా నవ్వింది సుమైత్రి. తన భావి జీవితం గురించి బహుశా కలలు కంటోందేమో!

ఇరవై రెండు సంవత్సరాల క్రితం ఎన్నో కలలతో అత్తవారింట్లో అడుగుపెట్టింది తను. కాపురానికి వెళ్లిన మరుసటిరోజే వంట గదికి అంకితమైపోయింది. నలుగురు ఆడపడుచులు, మరిది, అత్తగారూ, మామగారూ... పెద్ద సంసారం తమది. ఇద్దరు ఆడపడుచులకు మామగారు ఉండగానే పెళ్లయింది. మరో ఇద్దరు ఆడపడుచుల బాధ్యత తమ మీద వేసి మామగారు కాలం చేశారు. వచ్చిన ప్రతి సంబంధానికి వంకలు పెట్టేవారు. మూడో ఆడపడుచుకు పెళ్లి వయస్సు దాటిపోవటంతో రెండో సంబంధం పెళ్లికొడుకును చూసి పెళ్లి అయిందనిపించారు. పెళ్లి అయ్యేంత వరకూ ఆమె సావిత్రికి నరకం చూపించింది.

తల్లి పెంపకంలో పెంకి ఘటాల్లా తయారైన ఆడపడుచులను చూస్తే వీళ్లు ఆడపిల్లలేనా అనిపించేది సావిత్రికి. ఏమాత్రం మాట పొరపాటు వచ్చినా భళ్లున తలుపులు బిగించుకొని కొంపలు మునిగినట్లు ఏడుపందుకొనేవారు. చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా అని పిల్లలను వెనకేసు కొచ్చి సావిత్రి తప్పు లేకపోయినా సాధింపులు మొదలుపెట్టేది అత్తగారు.

తల్లీ, తండ్రీ లేని సావిత్రి తన బాధను పెద్ద అన్నగారి దగ్గర చెప్పుకున్నా అన్నగారు తన అసహాయతను వ్యక్త పరిచేవాడు గానీ నోరు తెరిచి సావిత్రి అత్తగారి ముందు నిలవలేకపోయేవాడు.



తల్లి, చెల్లెళ్ల గడసరితనానికి సమాధానం చెప్పలేక నోరు మెదిపేవాడు కాదు దివాకర్. సుధాకర్ చదువు అయి, ఉద్యోగం సంపాదించుకొని, మేనమామ కూతుర్ని పెళ్లాడి తెలివిగా ఆ ఇంటి నుంచి వేరింటి కాపురం పెట్టేశాడు. అత్తా, ఆడపడుచుల ఆరళ్ల నుంచి తన తోడికోడలు తప్పించుకోవటం సావిత్రి మనస్సులో చాలా సంతోషించింది. తమది ఆరు గదుల ఇల్లు అవటంతో రెండు గదులు అద్దెకిచ్చి, మరో రెండు గదుల్లో తమతో వేరింటి కాపురం పెట్టించేసింది అత్తగారు. నెలనెలా ఒకటవ తేదీ రాగానే అద్దె వసూలు చేసేది. అమ్మిన పొలం అమ్మగా మిగిలిన నాలుగెకరాల అయివేజు ఆడపిల్లలకు దాచి ఉంచేది. అదేమని అడిగే అధికారం మగపిల్లలకు లేకుండా చేసింది.

కాలగమనంలో రోజులు దొర్లిపోతుండగా ఇద్దరు పిల్లల తల్లి అయింది సావిత్రి. ముద్దులు మూటకడుతున్న ఆ పిల్లలు నాయనమ్మ ముద్దు మురిపాలకు గానీ, ఒక జత బట్టలకు గానీ నోచుకోలేదు. అష్టకష్టాలకోర్చి అతికష్టం మీద ఆఖరి చెల్లెలు పెళ్లి అయిందనిపించాడు దివాకర్. బాధ్యతలన్నీ తీరి కొంచెం ఊపిరి పీల్చుకుంటుండగా భర్తతో తగవు పెట్టుకొని ఇద్దరు ఆడపిల్లలతో పుట్టింటికి చేరింది మూడో ఆడపడుచు. ఆమె అధికారం ఎక్కువయింది ఆ ఇంట్లో. ఓ రోజు ఆఫీసు నుంచి రాగానే ట్రాన్స్‌ఫర్ వార్త మోసుకొచ్చాడు దివాకర్. తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది సావిత్రి. అత్తా, ఆడపడుచులను తమతో పాటు రమ్మన్నాడు. ససేమిరా అన్నారు వాళ్లు.

అత్తవారింట్లో ఏడు సంవత్సరాలు ఒంటరి పోరాటంతో విసిగిపోయింది సావిత్రి. కొత్త ఊరు, కొత్త వాతావరణం ఆమెకు బాగా నచ్చాయి. ఆలోచనల మధ్య ఎప్పుడో చిన్నగా కునుకు పట్టింది సావిత్రికి. మధ్య రాత్రి దివాకర్ వచ్చి తట్టి లేపే వరకూ ఆమెకు మెలకువ రాలేదు. భజంత్రీలు మోగటంతో నిద్రలో ఉన్న వారంతా లేచి కూర్చున్నారు. సుమైత్రికి తలంటు స్నానం చేయించి పెళ్లికూతురి ముస్తాబు చేశారు. పెళ్లికూతురి అలంకరణలో మెరిసిపోతోంది సుమైత్రి. ఆ ముస్తాబులో కూతుర్ని చూసుకుంటున్న సావిత్రికి ఓ పక్క సంతోషంగా ఉన్నా మనసులో ఏదో ఓ మూల దిగులు... భయం... తన కూతురు అత్తవారింట్లో సుఖపడుతుందా? తనలాగే... వద్దు వద్దు... తన కూతురు తనలా కాకూడదు. తను అలా కానివ్వదు. సుమైత్రికి ఏ

## గడసరి తమన్నా

మిల్కీవైట్ భామ తమన్నాకి తెలుగులో కంటే తమిళంలో మంచి డిమాండ్ వుందిప్పుడు. సినిమాకి 75 లక్షల వరకూ డిమాండ్ చేస్తోందనే వార్తలకు తమన్నా స్పందిస్తూ- 'ఎవరికి వారు ఊహించేసుకుని ఇంతా అంతా అనుకుంటున్నారు. నేను డబ్బు మనిషిని కాను. కథ విన్నాక నా పాత్ర నచ్చాక సిని మాని అంగీకరిస్తాను తప్ప పారితోషికం డిమాండ్ చేయను. ఇక నిర్మాత నా పాపులారిటీని దృష్టిలో పెట్టుకుని ఎంత ఇవ్వాలనుకుంటారో అంత ఇస్తారు గానీ నేనెంత అడిగితే అంత ఇచ్చేస్తారా' అని చెప్పింది తప్ప, ఇంత మొత్తం తీసుకుంటున్నా అని మాత్రం సెలవీయలేదు.







సమస్య వచ్చినా తామంతా అండగా ఉండాలి. సంసార మనే సాగరంలో పడేసి ఈదుకోమని ఒదిలెయ్యకూడదు... మనస్సులో గట్టిగా అనుకుంది సావిత్రి.

పెళ్లితంతు ఏ అడ్డంకులూ లేకుండా ఎంతో వేడుకగా ముగిసింది. అప్పగింతల కార్యక్రమానికి తొందర పడుతున్నారు మగపెళ్లివారు. ఎంత ఆపుకుందామన్నా కన్నీళ్లు ఆగటం లేదు సావిత్రికి. దివాకర్ మధ్యమధ్యలో కండువాతో కళ్లొత్తుకుంటున్నాడు. ఇటు ఆడపెళ్లివారు, అటు మగపెళ్లివారు పీటల మీద కూర్చున్నారు. మధ్యలో పాలపళ్లెం పెట్టారు. సుమైత్రికి అటూ, ఇటూ సావిత్రీ, దివాకర్ కూర్చుని ఒక్కొక్క జంట చేతుల్లో సుమైత్రి చేత పాలు అద్దిస్తున్నారు. పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు. పాలూ, నీళ్లలా అత్తవారింట్లో కలసిపోవాలని చెప్తున్నాడు.

అప్పగింతల తంతు ముగిసింది. సుమైత్రికి తన చేతుల మీదుగా పెరుగన్నం తినిపించింది సావిత్రి. తల్లి చెంపల మీదుగా కారుతున్న కన్నీటిని తన మెత్తని చేతులతో తుడుస్తూ ఆమె భుజం మెల్లగా తట్టింది సుమైత్రి.

"వదినగారూ! మా సుమైత్రి ఎంతో అపురూపంగా పెరిగింది. దానిని మీ చేతుల్లో పెడుతున్నాం. జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత మీదే" వియ్యపురాలి చేతిలో సుమైత్రి చేయి ఉంచింది సావిత్రి.

"మీరు అంతగా చెప్పనక్కరలేదు వదినగారూ! మేము ఎలాంటి వాళ్లమో మీకంటే సుమైత్రికే బాగా తెలుసు. ఎప్పుడో పాతిక సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకొని అత్తవారింటికి వెళ్లారు మీరు. ఎన్నో కష్టాలకోర్చి పిల్లలను పైకి తీసుకువచ్చారు. మన తర్వాతి తరం వాళ్లు వీళ్లు. మన పిల్లలెపుడూ అమాయకులే అనుకుంటాం మనం. కానీ... వాళ్లు మనకంటే రెండాకులు ఎక్కువే చదివారని అనుకోము. మీ భర్త స్నేహితుని ద్వారా మా సంబంధం రావటంతో మీరు మీ పిల్లను మాకు అప్పగించటానికి పెద్దగా ఆలోచించలేదు. కానీ సుమైత్రి మా గురించి ఎంతమందిని ఎంక్వయిరీ చేసిందో బహుశా మీరు ఊహించి ఉండరు. మీరు అత్తవారింట్లో పడిన మానసిక క్షోభను అర్థం చేసుకొని తన విషయంలో మీ మనస్సు ఎలా స్పందిస్తుందో ఊహించిన సుమైత్రి మా వాడి గురించి వాడు చదివిన కాలేజీలో గుట్టుగా ఎంక్వయిరీ చేసిందనే విషయం మీరు ఊహించగలరా! మా గురించీ, మా మనస్తత్వాల గురించీ మీకు తెలియకుండా మా వాడితో మా ఇంటికి వచ్చి గమనించిందనే విషయం మీరు నమ్ముతారా! కానీ...

ఇవన్నీ నేను గమనించాననే విషయం తనకి తెలీదు వదినగారూ! నేనూ ఆడపిల్లలకు తల్లినే. కాలం మారుతోంది. కాలంతో పాటు మనమూ మారాలి. పరాయి ఇంటి నుంచి వచ్చిన ఆడపిల్ల అని ఆమెను మనం చులకన చేయకూడదు. ఈ రోజుల్లో మగపిల్లల కంటే మేమేం తక్కువ కాదని ఆడపిల్లలూ చదువుకుంటున్నారు. విదేశానికి వెళుతున్నారు. ఇంకా వాళ్ల మీద పెత్తనం చెలాయిస్తే మనమంటే వాళ్లకేం గౌరవం ఉంటుంది? మనని వాళ్లు గౌరవించాలంటే మన ప్రవర్తనలో ఏ లోపం ఉండకూడదు. మీ అమ్మాయి వస్తూ మా వాడికి అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. మా వాడికి అమెరికాలో మంచి ఉద్యోగం వచ్చింది. మీ అమ్మాయిని మీరు కోరుకున్న చోటే కోరుకున్న విధంగానే అప్పగించారు" సుమైత్రి అత్తగారు, ధైర్యంగా ఉండమన్నట్లుగా సావిత్రి భుజం తట్టింది. ఆవిడ మాటలన్నీ ఆశ్చర్యంగా వింటున్న సావిత్రి కళ్ల నుండి రెండు ఆనంద బాష్పాలు రాలి ఆవిడ చేతుల్లో పడ్డాయి.

★



## టాలీవుడ్ అంటే ఇష్టం

జూనియర్ ఐశ్వర్యారాయ్‌గా పేరుపొందిన స్నేహా ఉల్లాల్‌కి బాలీవుడ్ కంటే టాలీవుడ్‌లోనే కాస్త కలిసొచ్చింది. అయితే ఇక్కడ నుంచి ఆమె కన్నడ రంగానికి కూడా వెళ్లిందీమధ్య. తనకి కన్నడంలో అవకాశాలు వస్తున్నప్పటికీ తన తొలి ప్రాధాన్యత మాత్రం తెలుగు రంగానికే అంటోంది స్నేహా ఉల్లాల్. తనకి తెలుగు చిత్రసీమ ఎంతగానో నచ్చిందని, ఇతర భాషల్లో అవకాశాలు వస్తే వాటిలో చేస్తూనే తెలుగులోనూ నటించాలనుకుంటున్నట్టు చెబుతోంది స్నేహ.